క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పాటూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్

వేపాడ: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను వల్లంపూడి ఎస్సై రాజేష్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. బొద్దాం, రామస్వామిపేట, పాటూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి వసతులు, భద్రతపై ఆరా తీశారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఆరుద్ర అన్నారు. బొండపల్లి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కాపుశంబాం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. సమతుల ఆహారంతో పాటు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, రాధిక, శకుంతల, అరుణ, కార్యకర్తలు కృష్ణవేణి, అన్నపూర్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తూనిక యంత్రాలకు సీళ్లు తప్పనిసరి


తూనిక యంత్రాలకు సీళ్లు వేస్తున్న దామోదరనాయుడు

బొండపల్లి: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని ఎండీయూ వాహనాల (రేషన్ పంపిణీ వాహనాలు) ఆపరేటర్లు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న తూనిక యంత్రాలకు సీళ్లు వేయించుకోవాలని జిల్లా తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు సూచించారు. మండలంలోని అన్ని ఎండీయూ ఆపరేటర్ల తూనిక యంత్రాలకు బోడసింగిపేట ఏఎంసీలో మగంళవారం సీళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా తూనికల యంత్రాలకు సీళ్లు వేయించడంతో పాటు రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆపరేటర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీ సత్యనారాయణ, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రాపాక కచవయ్య, పెదపల్లి తవిటయ్య పశుగ్రాసం కోసం వేసుకున్న రెండు గడ్డివాములు కాలిపోయాయి. సమాచారం అందుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రవిప్రసాద్ తెలిపారు.

జోరందుకున్న ఎన్నికల ప్రచారం


చినరవ్యాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి చీపురుపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. చెల్లాపురం పంచాయతీ మధుర గ్రామమైన చినరవ్యాంలో పార్టీ నాయకులు కర్రోతు నాగేశ్వరరావు, పల్లి కృష్ణ, లావేటి సన్యాసినాయుడు, మహేష్, అన్నంనాయుడు తదితరులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కేజీబీవీలో బోధన భేష్

- నాడు–నేడు కింద రూ.43 లక్షలతో సౌకర్యాల కల్పన
- డిజిటల్ విధానంలో విద్యా బోధన
- జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు


మధ్యాహ్న భోజనాలు చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు


మరుపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

గజపతినగరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తుండటంతో విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నారు. మండలంలోని మరుపల్లి వద్ద ఉన్న కేజీబీవీలో రూ.43 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సౌకర్యం, ఆర్వో ప్లాంట్, తాగునీటి కుళాయిలు, తరగతి గదుల్లో మార్బుల్ ఫ్లోరింగ్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, వంటివి ఏర్పాటు చేశారు. బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్)ను ఏర్పాటు చేసి డిజిటల్ విధానంలో బోధన చేస్తున్నారు. నాణ్యమైన విద్యతో పాటు యోగా, వ్యాయామం, స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థులు చక్కగా రాణిస్తున్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. హైస్కూల్ స్థాయి నుంచి కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడి విద్యార్థులు పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.


విద్యార్థినులకు యోగాలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది


వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ


సాహస కృత్యాల్లో రాణిస్తున్న విద్యార్థినులు


విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు

పేదల గుండెచప్పుడు వైఎస్ జగన్


కలగాడలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: పేదల గుండెచప్పుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో కలగాడ, మామిడిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. సంక్షేమ పథకాల అమలుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని తరఫున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బొత్స ఝాన్సీని ఆశీర్వదించలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలన్నా.. మళ్లీ జగనన్న సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు సమీపించడంతో టీడీపీ నేతలు కల్లబొల్లి కబుర్లతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని కోరారు. గతంలో చంద్రబాబు చేసిన మోసాలపై టీడీపీ నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, స్థానిక సర్పంచ్ బాదిరెడ్డి సత్యవతి, ఎంపీటీసీ చొక్కాకుల రమణమ్మ, నేతలు జన్నేల సూరిదేముడు, బాదిరెడ్డి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు లగుడు సూర్యనారాయణ, లగుడు దేముడు, తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి


కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ వార్డు సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలో దిశానిర్దేశం చేశారు. నాయకులు వేరే పార్టీలకు వెళ్లినంత మాత్రాన ప్రజలు వెళ్లరని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని, ఆయన మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని అన్నారు. ప్రతిపక్షాలు ఓటమి భయంతో గ్రామాల్లో అలజడులను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, వాటిని దీటుగా ఎదుర్కోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, పార్టీ రాష్ట్ర నాయకులు బి.వి. ప్రభుజీరాజు, ఎం.కొత్తవలస ఎంపీటీసీ కర్రోతు లక్ష్మీనారాయణమ్మ, వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కోరాడ సత్యనారాయణ, నాయకులు కోవ్వాడ అప్పలనాయుడు, కర్రోతు మాధవ్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● సాఫీగా సాగిపోయేలా..


కొత్తవలస-విజయనగరం రోడ్డు


గతంలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు (పాతచిత్రం)

కొత్తవలస: మండల కేంద్రంలో కొత్తవలస–విజయనగరం రోడ్డు మరమ్మతులను అధికారులు యుద్ధ ప్రాతిపదికను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం రహదారి మరమ్మతులకు రూ.4.01 కోట్లు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. కంటకాపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు సుమారు 8 కిలోమీటర్లు మేర రహదారిని పునర్నిర్మించారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతుండటంతో వాహనచోదకులు, ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు


ఎం.కొత్తవలసలో ఎన్నికల కోడ్ అమలును పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: అన్ని గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మంగళవారం పర్యటించారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పథకాలకు సంబంధించిన పోస్టర్లు ఎక్కడా లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


బోరు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొండపల్లి: వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా గొట్లాంలో గ్రామంలో చేపట్టిన తాగునీటి బోరు మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడైన తాగునీటి బోర్లను బాగుచేసేందుకు క్రాస్‌ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఉన్న 476 తాగునీటి బోర్లను పరిశీలించి, పాడైన వాటిని బాగు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏఓ డి.వెంకటరమణ ఉన్నారు.

పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలి


ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చలపతిరావు

వేపాడ: పాడిరైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ చలపతిరావు సూచించారు. మండలంలోని నీలకంఠాజపురం రైతుభరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కొత్తగా నియామకం పొందిన ఏహెచ్‌ఏకు చేపట్టాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఆయనతో పాటు వేపాడ పశు వైద్యాధికారి సింహాచలంనాయుడు, గోపాలమిత్ర సింహాద్రప్పడు ఉన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

జామి: మండలంలో అన్నంరాజుపేట గామ శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం దాడులు చేపట్టారు. కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కోడిపుంజులు, రూ.4,690 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

మంత్రి బొత్స పర్యటన రేపు

మెరకముడిదాం: రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 21న మెరకముడిదాం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోట్ల విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. గొళ్లలవలస, సిరిదేవిపురం గ్రామాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొంటారని అన్నారు. రాత్రి 7 గంటలకు ప్రచార సభలు ప్రారంభమవుతాయని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

దత్తిరాజేరు: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో వైఎస్సార్‌సీపీ స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొని ఎన్నికల ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

జామి: మండలంలో జాగరం గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థమహోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు జాకేరులో సీతారాముల కల్యాణోత్సవం

వేపాడ: మండలంలో జాకేరు గ్రామంలో సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు దంపతుల నేతృత్వంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్వామివారి కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నీలకంఠరాజపురంలో..

నీలకంఠరాజపురంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 20న గణపతి పూజ, మండపారాధన, 21న క్షీరాభిషేకం, జలాదివాసం, ధాన్యాదివాసం, 22న విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

భక్తజన సందోహం


కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


పూజలందుకుంటున్న కోటదుర్గమ్మతల్లి


ఆలయం వద్ద భక్తుల సందడి

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు మూడో రోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కోరిన కోరికలు నెరవేరడంతో మొక్కులు చెల్లించారు. వేకువజాము నుంచే ఆలయం వద్ద బారులుతీరారు. ఉచిత దర్శనాలతో పాటు రూ.50, రూ.20 దర్శన టికెట్ల క్యూలు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి ఆలయం ఆవరణలో ఉన్న రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కనకమహాలక్ష్మి అమ్మవారి అక్కచెల్లెల్లుగా చెప్పుకునే కోటదుర్గమ్మ, అసిరితల్లి, సంతానలక్ష్మి, భాగిరేతమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు.

83 మందికి వైద్య సేవలు


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో 104 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ కోరారు. మండలంలోని రామన్నపేట గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 83 మందికి వైద్య సేవలందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గొట్లాంలో 'ఆరోగ్య సురక్ష'


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.హరిహరరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బొండపల్లి పీహెచ్‌సీ, గజపతినగరం సీహెచ్‌సీ వైద్యులు శిబిరంలో పాల్గొని సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సీహెచ్‌ఓ రాజగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో మంగళవారం చండీయాగం నిర్వహించారు. వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, శంబర కృష్ణలు శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను నిర్వహించారు. యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.